చాపరాయికి తగ్గిన పర్యాటకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకుల తాకిడి కొంతమేరకు తగ్గింది. కార్తిక మాసం ప్రారంభం నుంచి గత వారం రోజులు వరకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ఈ వారం పర్యాటకుల తాకిడి తగ్గింది. ఆదివారం వచ్చిన పర్యాటకులు చాపరాయి జలపాతంలో సరదాగా జారుతూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. రోడ్డు కిరువైపులా ఉన్న వలిసే తోట పూలల్లో పర్యాటకులు ఫోటోలు తీసుకుంటూ సందడి చేసి కుటుంబ సమేతంగా ఆహ్లాదంగా గడిపారు.

నిర్మానుష్యంగా ఉన్న చాపరాయి

జనజీవన స్రవంతిలో కలవాలి

▶▶ జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ ▶▶ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్నంగా వారధి ▶▶ లొంగుబాటు దళ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు, చింతపల్లి, పోలీస్ సబ్ డివిజన్లలో గత కొన్నేళ్ల కాలంలో లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యులు, మిలీసియా సభ్యులతో అల్లూరి జిల్లా పోలీస్ శాఖ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీప ప్రాంగణంలో వారధి పేరిట 'ఆత్మీయ సమ్మేళన సంబరాలు నిర్వహించారు. వినూత్న రీతిలో పోలీస్ అధికారులు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో అల్లూరి ఏజెన్సీ 11 మండలాల్లో పెదబయలు కోరుకొండ గాలికొండ ఈస్ట్ డివిజన్ మావోయిస్టు పార్టీలో పనిచేసి లొంగిపోయిన సుమారు 180 మంది మావోయిస్టు దళ, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గతంలో పెదబయలు కోరుకొండ కమిటీలకు కార్యదర్శిగా పని చేసిన చిక్కుడు చిన్నారావు అలియాస్ సుధీర్, శ్రీకాంత్, మరో ఎనిమిది మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరందరితో పాటు పట్టణంలోని అన్ని పత్రికల మీడియా ప్రతినిధులను ఆహ్వానించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, లొంగిపోయిన దళ సభ్యులు, సానుభూతిపరులతో పోలీస్ శాఖ నిరంతరం సన్నిహితమైన సుహృద్భావ సంబంధాలను కొనసాగించేందుకు ఈ వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జనజీవన స్రవంతిలోకి వచ్చి స్వేచ్ఛగా జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పోలీస్ అధికారులు, సభ్యులతో కలిసి భోజనం చేశారు. సంబరాలకు హాజరైన సభ్యులందరికీ సంక్రాంతి కానుకలుగా స్టీల్ బిందెలను ఎస్పీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్లు ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

లొంగిపోయిన దళ సభ్యులకు భోజనాలు వడ్డిస్తున్న ఎస్‌పి

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్, పాల్గొన్న గిరిజనులు

పోడు రైతులపై వేధింపులు ఆపాలి

- కందకాలు తవ్వడం సరికాదు

- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి- ఎటపాక

పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లగొప్ప గ్రామంలో ఆదివారం సిపిఎం నాయకులు పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ గొల్లగొప్ప గ్రామంలోని పోడు భూముల్లో కందకాలు తవ్వాలనే ఆలోచనతో ఆదివాసీలను ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు సీపీఎం అండగా ఉంటుందని, ఫారెస్ట్ అధికారుల బెదిరింపులకు ఎవరు భయపడవద్దని సూచించారు. పోడు భూముల్లో ఎర్రజెండా ఎగురవేయలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. పోడు భూముల్లో కందకాలు తవ్వాలనే ఆలోచన మానుకోవాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఇరపా అజయ్, పులుసు బాలకృష్ణ, గిరిజన సంఘం నాయకులు పెనుబల్లి వెంకన్నబాబు, లాయర్ మడివి రవితేజ పాల్గొన్నారు.

465 అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన

'ప్రజాశక్తి'తో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లో కొత్తగా మరో 465 అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి వెల్లడించారు. గ్రీవెన్స్‌లో అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు కోసం వచ్చిన ఫిర్యాదులు, పలు ప్రాంతాలలో ప్రజల వినతులపై జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు అవసరతపై పరిశీలన చేసి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అల్లూరి జిల్లాలో అంగన్వాడి సేవల విస్తరణకు చేపడుతున్న చర్యలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే.....

ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలెన్ని?

అల్లూరి జిల్లాలో 1791 మెయిన్ అంగన్వాడి కేంద్రాలు, 1423 మినీ అంగన్వాడీ కేంద్రాలు కలిపి మొత్తం 3,214 కేంద్రాలు ఉన్నాయి.

అదనంగా కేంద్రాలకు ప్రతిపాదనలు

ఇప్పటికే ప్రభుత్వానికి రెండు విడతలుగా జిల్లాలో కొత్త అంగన్వాడి కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేసాం. వీటిలో 356 మెయిన్ అంగన్వాడి కేంద్రాలు, 109 మినీ అంగన్వాడి కేంద్రాలు మొత్తం 465 ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. 243 మినీ అంగన్వాడి సెంటర్లను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు చేశాం.

విస్తరణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లాలో ఎక్కువ శాతం దూరం ఏరియాలో అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. అందువల్ల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం కింద నెలకు సరిపడ సరుకులను గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెల పంపిణీ చేస్తున్నాం. ఈ మేరకు జిల్లాలోని 11 వేల 31 మంది గర్భిణీలకు, 11వేల 17 మంది బాలింతలకు, 3ఏళ్లలోపు చిన్నారులు 57 వేల రెండు 27 మందికి రేషన్ సరఫరా జరుగుతుంది. 3 నుంచి 6 ఏళ్ళ లోపు 44 వేల 804 మంది పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లోనూ పోషకాహార పంపిణీ పటిష్టంగా నిర్వహిస్తున్నాం.

ఖాళీ పోస్టులు లెన్ని.?

జిల్లా పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 3 మెయిన్ అంగన్వాడి కేంద్రాలు, 11 మినీ కేంద్రాల్లో వర్కర్ పోస్టులు, మరికొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో 6 హెల్పర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు లేని చోట ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఇటీవల కొన్ని అంగన్వాడీ పోస్టులు భర్తీ చేసాం. 90 సూపర్వైజర్ శాంక్షన్ పోస్టులకు గాను, 61 మంది ఉన్నారు. 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు

అంగన్వాడి సేవల కల్పనపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. ఇటీవల జిల్లా వ్యాప్తంగా పర్యటించాను. ప్రాజెక్టుల వారీగా లోటుపాట్లు పరిశీలించి అంగన్వాడీల ద్వారా పోషకాహార పంపిణీ సమర్థవంతంగా లబ్ధిదారులందరికీ అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం.

పౌష్టికాహారం పంపిణీ

డ్రై రేషన్‌తో పాటు గుడ్లు, 5 రకాల పోషకాహార పదార్థాలు ఉండే వైయస్సార్ కిట్లు, పంపిణీ పై ప్రత్యేక దృష్టి సారించాం. అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం పోషకాలతో కూడిన బియ్యం పంపిణీ చేస్తోంది. ఇవి గర్భిణీలు, బాలింతలు పిల్లలకు ఎంతో మేలైన పోషకాహారం. వీటిని లబ్ధిదారులైన గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి కోరారు.

గ్రామ సభలో పాల్గొన్న మోతుగూడెం పంచాయతీ ప్రజలు

కుల ధ్రువీకరణ పత్రాలపై గ్రామసభ

ప్రజాశక్తి - మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధి ఇంతలూరు వాగులో శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించారు. మోతుగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోర్బాయి, ఇంతులూరువాగు, ఒడయాక్యాంప్, ఎంసిడి క్యాంపు, రాజ్ క్యాంపు గ్రామాల ప్రజలు ఎపిజెన్కో పవర్ ప్లాంట్ కట్టినప్పటి నుండి ఇక్కడే ఉంటున్నామని తెలిపారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, ముంచుంగిపుట్టు తదితర గ్రామాలలో ఉన్న తమ తెగ వారికి ఎస్‌టి పోర్జ, గౌడ, కొందు, వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని దష్టిలో తమ పిల్లల భవిష్యత్తు కోసం తమకు కూడా ఎస్‌టి, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. మోతుగూడెం, సుకుమామిడి, తూలుగొండ, గొడ్లగూడెం, దబ్బగూడెం, కొత్తపల్లి, గూడూరు, గొందిగూడెం గ్రామాల చెందిన వారు కూడా ఇక్కడే పుట్టి పెరిగారని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వలస వచ్చిన ఒడియా తెగవారికి ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి తమకు ఏ మాత్రం అభ్యంతరం లేదని, కానీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే ముందు వారి కుటుంబ సభ్యులు దగ్గర నుంచి విచారణ జరిపి ఇవ్వాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు. ఈ గ్రామసభలో తహశీల్దారు, పంచాయతీ సెక్రెటరీ, సచివాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా చేపడుతున్న ఇంటి నిర్మాణం

ఆగని అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి-హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలకు విరోధంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. రెవిన్యూ అధికారులు హెచ్చరించి నప్పటికీ నిలుపుదల చేయలేదు. ప్రజా సంఘాల నేతలు ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ యధావిధిగా కట్టడాలు పూర్తయిపోతున్నాయి. మండల కేంద్రంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. బరోడా బ్యాంక్ పక్కన అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని తహశీల్దార్, రెవిన్యూ బృందం హెచ్చరించినా ఆదివారం స్లాబ్ వేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇల్లు నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాలకు బోర్డులు ఏర్పాటు చేస్తేనే తప్ప నిలుపుదలకు మార్గం కనిపించ లేదు. అక్రమ కట్టడాలపై చర్యలు ఏ రకంగా చేయాలో రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది.



సబ్ కలెక్టర్‌కు స్వామివారి చిత్ర పటాన్ని ఇస్తున్న తహశీల్దార్

మత్స్యలింగేశ్వర స్వామి సన్నిధిలో సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీలోని ప్రముఖ పుణ్య క్షేత్రం మత్స్య గుండం లో మత్స్యలింగేశ్వర స్వామిని పాడేరు సబ్ కలెక్టర్ వీ అభిషేక్, తన తండ్రితో కలిసి ఆదివారం స్వామి వారిని దర్శించుకున్నారు. రెండు కంచు దీపపు కుంధులను దేవాలయ కమిటీకి అందించారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కు తహశీల్ధార్ రాజ్యలక్ష్మి సన్మానించారు. స్వామి వారి చిత్ర పటాన్ని ఆలయ కమిటీ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, పురాతన కాలం నుంచి పేరును గాంచిన మత్స్య లింగేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ రంగారావు, వీఆర్వో రెడ్డి సూర్య ప్రకాష్, మఠం సర్పంచ్ సోమేలి శాంత కుమారి, ఆలయ కమిటీ సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు, మఠం సింహాచలం నాయుడు ఉన్నారు.

చలి పులి

-కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు

-గజగజ వణుకుతున్న మన్యం ప్రజలు

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీ ప్రాంతంలో చలి పులిగా మారడంతో ప్రజలు గజగజ వణుకుపోతున్నారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆదివారం ఆంధ్రా కాశ్మీర్ లంబసింగి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదయ్యాయి. జీకే వీధి మండలం సీలేరులో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలు నమోదైంది. సీలేరు పరిసర ప్రాంతాల్లో అధికంగా మంచు కురిసి చల్లటి గాలులు వీయడంతో చలి తీవ్రత మరింత అధికమైంది. తెల్లవారుజామున అధికంగా మంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. సీలేరు పరిసర ప్రాంతాలతో పాటు స్థానిక ఏపీ జెన్కో కాలనీ, మార్కెట్ సెంటర్లో అధికంగా మంచు కురుస్తుండడంతో రోడ్లపై సంచరించేందుకు జనం సాహసించడం లేదు. చలి తీవ్రత వలన ఆదివారం దుకాణాలు ఆలస్యంగా తెరిచారు. రోజంతా చల్లటి గాలులు వీశాయి. వారం రోజుల క్రితం వరకు చలి, మంచు తీవ్రత అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో మంచు తీవ్రతతో పాటు చలి అధికమైంది. సీలేరు నది పరివాహక ప్రాంత ప్రజలతోపాటు ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు చలికి తాళలేక చలి మంటలు కాసుకొని ఉపశమనం పొందుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, పాఠశాల విద్యార్థులు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లి, లంబసింగిలో దాదాపుగా మైనస్ డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకోవడంతో ఈ ప్రాంతాలు అతి శీతలంగా మారాయి. దీంతో మంచు అందాలు, చలిని పర్యాటకులు ఆశ్వాదించి పరవశించిపోతున్నారు. ఈ ప్రాంతాలకు పర్యాటకులు క్యూ కడుతున్నారు.

సీలేరు మార్కెట్‌లో దట్టంగా కురుస్తున్న మంచు

దట్టంగా కురుస్తున్న మంచు

పాడేరు : మన్యాన్ని చలి వణికిస్తోంది. గత రెండు రోజులుగా మన్యంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో, చలి తీవ్రత పెరిగింది. మంచు దట్టంగా కురుస్తుండడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆదివారం అల్లూరి జిల్లాలో జి.మాడుగుల మండలంలో 4.9, చింతపల్లిలో 5.1, అరకు వ్యాలీలో 5.4, వై.రామవరంలో 5.8, అనంతగిరిలో 5.9, పాడేరులో 6.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో రాత్రి వేళలో కురుస్తున్న మంచు కూడా గడ్డ కడుతోంది. ఈ నెల ఐదు నుంచి ఉన్నట్టుండి చలి తీవ్రత పెరిగింది.

జి.మాడుగుల : మండలంలో ఆదివారం గిరిజనులను చలి గజ గజ వణికించింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో తీవ్రమైన చలితో పాటు వాహనాలపై మంచు గడ్డలు కట్టాయి. దీంతో ప్రజలు ఒక్కసారిగా గజగజలాడారు. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో ఇటువంటి చలి, గడ్డలు కట్టడం ఇదే తొలిసారిగా చూస్తున్నామని స్థానికులు తెలిపారు.

డుంబ్రిగూడ: మండలంలో గత రెండు రోజుల నుంచి దట్టమైన పొగ మంచు వీస్తుండటంతో చలి తీవ్రత పెరిగింది. ఈ చలి తీవ్రతకు తట్టుకోలేక గిరిజనులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. అరకు ప్రాంతంలో సందర్శించిన పర్యాటకులు చలి మంటలు వేసుకుంటున్నారు.

డుంబ్రిగుడలో మంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనచోదకులు

ఆరుబయట ఉన్న ద్విచక్ర వాహనంపై గడ్డ కట్టిన మంచు

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు కుంజా రాధ

చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో రాణింపు

ప్రజాశక్తి-కూనవరం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు చాలా కీలకమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు కుంజా రాధ అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆదివారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుంజా రాధ మాట్లాడుతూ చదువు వల్ల ప్రాధాన్యత, సావిత్రిబాయి పూలే మహిళలకు, బాలికలకు చదువు కోసం బడులు తెరిపించిన విధానం గురించి తెలియజేశారు. మహిళల మీద జరుగుతున్న దాడులు, హింస, అత్యాచారాలు, హత్యలు, వేధింపులు నిర్మూలించే విధంగా మహిళలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీ పురుషులు సమానమని, కులమత భేదాలు లేవని, అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. మహిళల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఐద్వా ఎన్నో పోరాటాలు చేసి నిర్భయ చట్టం, దిశా చట్టం, పోక్స్ చట్టం వంటి ఎన్నో చట్టాలను సాధించినట్లు చెప్పారు. అయితే వాటిని అమలుపరిచే విధానంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నేరం చేసిన వారికి శిక్ష పడే విధంగా ప్రభుత్వం చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో పండగ వాతావరణం

నూతన దుస్తులు, సరుకులు కొనుగోలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండలో ఆదివారం జరిగిన వారపు సంతలో సంక్రాంతి సందడి కనిపించింది. సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో గిరిజనులు కొత్త బట్టలు, తమకు కావాల్సిన సరుకులు, సామగ్రి పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. జీకే వీధి మండలంలోని సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవులు పంచాయితీలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో సంతకు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంత గిరిజనులు సంక్రాంతి పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. బంధుమిత్రులను ఆహ్వానించి వారి ఆచార సాంప్రదాయాలకు అనుగుణంగా రకరకాల వంటకాలు తయారు చేసి పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సహపంక్తి భోజనాలు చేస్తారు. ఈ నేపథ్యంలోనే గిరిజనులు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేశారు.

సంతకు పెద్ద సంఖ్యలో వచ్చిన గిరిజనులు

పార్టీ కోసం పాటుపడితే గుర్తింపు : వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-పాయకరావుపేట:ప్రభుత్వంపై దుష్ట చతుష్టయం చేస్తున్న విష ప్రచారాన్ని రాబోయే ఎన్నికల్లో తిప్పి కొట్టి ఇంటికి సాగనంపాలని టిటిడి ఛైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా ప్రభుత్వంపై మాయమాటలతో దుష్ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మితే పేద ప్రజలు మోసపోయి పథకాలకు దూరమైపోతారన్నారు. మండల కేంద్రంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అధ్యక్షతన నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతి ఇంటికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించాలన్నారు. పార్టీలో మనస్పర్థలు పక్కన పెట్టి పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యే గొల్ల బాబూరావును గతం కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ పరంగా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ బి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూటూరు శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు బాబూరావు, జెడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఎంపిపి పార్వతి తాతారావు, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, నియోజకవర్గ నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన ఎంపిటిసిలు

కోటవురట్ల:ఎంపిటిసి రాంబాబు, టికెపట్నం ఎంపీటీసీ సభ్యులు వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మండలంలో సమస్యలతో పాటు గ్రామీణ ప్రాంత ఆలయాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

జిఒ 1ని రద్దు చేయాలి : అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: జిఒ 1ని వెంటనే రద్దు చేయాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఆదివారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే ఆరు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి ఈ మూడున్నరేళ్లలో ఎన్నిచేశారన్నారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రభుత్వ తప్పుడు జిఒలు తెచ్చి నిరంకుశంగా వ్యవహరిస్తుందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి పాద యాత్రకు ఎటువంటి ఆటంకం కలగకుండా అప్పటి తమ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని గుర్తు చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సభలు, పాదయాత్రలు రాజ్యాంగం కల్పించిన హక్కు అని భావించి జగన్ పాదయాత్రకు అనుమతి ఇవ్వడం జరిగిందని చెప్పారు. వైసిపి పాలనపై ప్రజలందరూ విసిగి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధా నాగ జగదీశ్వరరావు, పార్టీ సెక్రటరీ లాలం కాశీనాయుడు, జెడ్పిటిసి సుకల రమణమ్మ, టిడిపి మండల అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం:టిడిపితోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. మండలంలో శెట్టిపాలెం, బీమ బోయిన పాలెం, దుంగలవానిపాలెం పంచాయతీలో ఇదే కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఆరెడ్ల పాత్రుడు, సర్పంచ్ అల్లు రామనాయుడు, రుత్తల కిషోర్, సర్పంచ్ దుంగల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి రుత్తల శేషు కుమార్, మాజీ వైస్ ఎంపిపి వెంకటరమణ, కోనూరు శ్రీను, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో బాలికల బాలికల వసతి గృహం విద్యార్థినులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సురేష్ 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలు అత్యున్నత ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థునులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ అన్ని రంగాలలో మహిళలు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఓ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

21వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

దీక్షలో కూర్చున్న నాయకులు

ప్రజాశక్తి-పాడేరు:ఐటిడిఏ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 21వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ :కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ, 21 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమం ఆపేది లేదని, వెంటనే జోక్యం చేసుకొని, గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను ఆశ్రమాల్లో నియమించాలన్నారు. రెండు నెలల వ్యవధిలోనే ఆరుగురు విద్యార్థులు మరణించినా అధికారులు, ప్రభుత్వానికి చలనం లేదన్నారు. పాడేరు ఐటిడిఏ పిఒ ను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులను గిరిజన విద్యా సంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక చిన్నారావు, కంబిడి లత కుమారి జీవన్, అమర్, విమల, స్వరూప పాల్గొన్నారు.

కార్మికునిపై దాడి

యజమానిపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు

బాధితున్ని పరామర్శిస్తున్న నేతలు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : అరకులోయ మండలం పద్మాపురం జంక్షన్ వసుంధర గ్రాండ్ రెస్టారెంట్లో హౌస్ కీపింగ్‌గా పని చేస్తున్న కార్మికుడు జన్ని చిన్నపై యజమాని అమర్‌నాథ్ దాడికి పాల్పడ్డాడు. చిన్నను గట్టిగా కొట్టడంతో అరకు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు జన్నీ చిన్న కథనం మేరకు... తనకు ఆరోగ్యం బాగో లేకపోవడంతో శనివారం పనికి వెళ్లలేదని, పనికి ఎందుకు రాలేదని యజమాని అమర్నాథ్ అడిగారని సమాధానం చెప్పేలోపే తనను కొట్టి బూటు కాళ్లతో కడి వైపు కడుపులో తన్నాడని చెప్పాడు. దీంతో నొప్పి ఎక్కువ కావడంతో తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించారన్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, గిరిజన సంఘం నాయకులు రామారావు, గురుమూర్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.యజమాని అమర్నాథ్ పై తక్షణమే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలకు ఆయన పాల్పడ్డాడని అయినప్పటికీ అమర్నాథ్‌లో ఎటువంటి మార్పు లేదని చెప్పారు. కార్మికులపై అమానుషంగా ప్రవర్తించి దాడి చేయడం అలవాటుగా మారిందని, ఇది దుర్మార్గమైన చర్య అని సిఐటియు నేతలు తెలిపారు.

ఎలక్ట్రికల్ వర్కర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో విజయలక్ష్మి దుర్గ ప్రైవేట్ ఎలక్ట్రికల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఎలక్ట్రికల్ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డివి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎలక్ట్రికల్ వర్కర్లు సభ్యులుగా ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం సహకారం సరిగా లేకపోవడంతో వర్కర్స్ కొన్ని ఇబ్బందులకు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలని కోరారు. ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశానికి ప్రతినెల హాజరవ్వాలని, పొదుపు చేస్తే అన్ని విధాలా అసోసియేషన్ ఆదుకుంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి 27న ఎలక్ట్రికల్ డే జరుపు తున్నామన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ ఐక్యతతో ఉండాలని, అప్పుడే ఏదైనా సాధించుకోగలమని ఆయన అన్నారు. ప్రమాదం బారిన పడిన వర్కర్స్‌ను యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి ఆదుకుంటుందని ఇన్సూరెన్స్ సభ్యులు ఇక్బాల్, రమణ తెలిపారు. ఎలక్ట్రికల్ వర్కర్లు భీమా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలాజీ, కోటేశ్వరరావు, నర్సీపట్నం ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సెక్రటరీ డి.వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న సిపిఎం సర్పంచ్ మొస్య

గిరిజనులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- అనంతగిరి: కల్పవల్లి అనాథ ఆశ్రమం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు రాజేంద్రకుమార్ మాస్టర్ సహకారంతో టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో. మొస్య ఆధ్వర్యాన ఆదివారం టోకూరు పంచాయతీ కొత్తవలస, బలియగుడ, దోరగుడ, బిర్జివలస గ్రామాల్లో 100 మంది పేద కుటుంబాలకు రగ్గులు, చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొస్య మాట్లాడుతూ, చలి తీవ్రత సమయంలో స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి ఉన్నితో కూడిన దుస్తులు పేదలకు పంపిణీ చేయడంపై కృతజ్ఞతలు చెప్పారు. రాజేంద్ర కుమార్ మాస్టర్ మాట్లాడుతూ, తాను సంపాదించిన దానిలో పేద గిరిజనులకు సాయం చేయాలనే ఆలోచనతో ఇప్పటికే పాడేరు, లంబసింగ్ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు సొసైటీ ఆధ్వర్యంలో చదివిస్తామని, అటువంటి వారు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో సేవా చేయాలనే ఆలోచన చాలా గొప్పదన్నారు. బలియగుడ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు. స్పందించిన రాజేంద్ర కుమార్ మాస్టర్ మార్చి నెలలో అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల దేవన్న, వార్డు మెంబరు పూజరి లక్ష్మణరావు, సతీష్, గెమ్మెల భీమరాజు, కిల్లో భగవాన్, గ్రామ పెద్దలు కొర్రా లక్ష్మణరావు, వాలంటీర్ గెమ్మెల అప్పలస్వామి పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురంలో దళితులను కించపర్చుతూ, దాడి చేసి అవమానం పరిచిన గ్రామానికి చెందిన అగ్రవర్ణ పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత దళితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 5న ఇరు వర్గాలతో మాట్లాడడానికి ఎస్ఐ పిలిపించగా, ఆమె సమక్షంలోనే గ్రామానికి చెందిన అగ్రవర్ణ పెత్తందార్లు దాడి చేసి గాయపరచడం జరిగిందని, దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా పోలీసులు కేసు నమోదు చేసి ఊరుకున్నారే తప్ప దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపలేదని తెలిపారు. దాడి చేసిన వారిని పోలీసులు రిమాండ్‌కు తరలించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు, హత్యాయత్నం కేసు కూడా నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అనకాపల్లి జిల్లా ఎస్పి స్పందించి దోషులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భయంగా ఉన్న దళితులకు రక్షణ కల్పించాలని, వారికి ఆర్థికంగా సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ, పులి శ్రీను, పులి మారతమ్మ, పులి నూకరత్నం, బీదా లోవతల్లి, నీలా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామంలో శ్రీ దుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు అనారోగ్యానికి గురి కావడంతో సంఘం తరపున రూ.2000 చొప్పున ఆగ్రో అడ్వయిజరి కమిటీ చైర్మన్ దాసరి వరహాలు సమక్షంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రగడ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పచ్చికూర వరహాలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు అనారోగ్యానికి గురైతే సంఘం నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఆకలి శివ, సిద్ధాకృష్ణ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురి కావడంతో ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. సంఘ సభ్యులు ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలుపుల నాయుడు, పి.అచ్చం నాయుడు, ఎస్.వెంకటి, మణికంఠ, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు పంచాయతీలో 32 కొత్త పింఛన్లు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం, సీలేరు పంచాయతీకి కొత్తగా 32 పింఛన్లు మంజూరైనట్లు వైసిపి నాయకులు కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలను అమలుపరుస్తు ఆయన చిత్తశుద్ధి నిరూపించుకున్నారని తెలిపారు. జనవరి నెల నుంచి పింఛనుదారులకు రూ.2,750 ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

శారీరక దారుఢ్య పరీక్షలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోలీసు నియామకాల్లో శారీరక దారుఢ్య పరీక్షలపై నిర్లక్ష్యం ప్రమాదానికి దారితీస్తుందని మహారాణిపేట సిఐ సోమశేఖర్ పేర్కొన్నారు. అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు శిక్షణ తరగతుల శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత పరీక్షలతో పాటు శారీరక దారుఢ్య పరీక్షలోనూ అర్హత సాధించడం చాలా అవసరమన్నారు. సరైన శిక్షకుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవడం ద్వారా సులభంగా అడ్డంకులను అధిగమించవచ్చన్నారు. పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువత సరైన ఆహార నియమాలు పాటించాలని, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు గురికాకుండా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు పాల్గొన్నారు.

బివైడి షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రపంచంలో అగ్రగామి నూతన ఇంధన వాహన తయారీదారు సంస్థగా పేరొందిన బివైడి విశాఖలో తన మొట్టమొదటి ప్యాసింజర్ షోరూంను ఆదివారం ప్రారంభించింది. ఈ షోరూంను పిపిఎస్ మోటార్స్ నిర్వహించనుందని నిర్వాహకులు తెలిపారు. తొలుత షోరూంను విశాఖపట్నం పిపిఎస్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ, బివైడి ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ ప్రారంభించారు. బివైడి ప్రగతిని వివరించారు.

గ్రీటింగ్ కార్డుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎంవిపి.కాలనీలోగల ఎస్‌విపిపి విఎంసి డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో సంక్రాంతి గ్రీటింగ్ కార్డుల తయారీపై ఉచిత శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు. సీనియర్ కార్టూనిస్ట్ పివిఆర్.మూర్తి సంక్రాంతి పండగ ప్రాముఖ్యాన్ని తెలిపే గ్రీటింగ్ కార్డుల తయారీలో మెళకువలను వివరించారు. 45 మంది బాలలు గ్రీటింగ్స్ తయారు చేశారు. అతిథులుగా సామాజికవేత్త భరణికాన రామారావు. కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ ఈదర రవి కిరణ్ హాజరయ్యారు.

ప్రజాశక్తి - వైశ్యరాజు జ్యూయలర్స్ ఆధ్వర్యాన..

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

- సమైక్య అపార్టుమెంట్ ప్రాంగణంలో సందడే సందడి
- జోష్ నింపిన సంక్రాంతి సంబరాలు
- డ్యాన్సులతో ఆకట్టుకున్న చిన్నారులు, కోలాటంతో చిందేసిన మహిళలు

ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

వైశ్యరాజు జ్యూయలర్స్ సహకారంతో 'ప్రజాశక్తి' ఆధ్వర్యంలో గాజువాక సమీపంలోని తోకాడ సమైక్య అపార్టుమెంట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఆద్యంతం ఉత్సాహాన్ని నింపాయి. చిన్నారుల డ్యాన్సులు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాలు, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా తలపెట్టిన ఈ ముత్యాల ముగ్గుల పోటీల్లో గాజువాక, తోకాడ ప్రాంతాల్లోని సమైక్య అపార్టుమెంట్, స్వర్ణసాయి ఎన్‌క్లేవ్, సిరి అపార్టుమెంట్, గ్రీన్ లైఫ్ అపార్టుమెంట్‌ల నుంచి మహిళలు పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో అబ్బురపరిచారు. వేదిక ప్రాంగణం వద్ద వైశ్యరాజు జ్యూయలర్స్ వారు ఉచితంగా మహిళలకు మెహందీ పెట్టారు.

ఉదయం 9 గంటలకే ఈ ముగ్గుల పోటీలు ఆరంభమయ్యాయి. సంక్రాంతి కళ ఉట్టిపడేలా రంగవల్లులను మహిళామణులు తీర్చిదిద్దారు. సేవ్ వైజాగ్ స్టీల్, సేవ్ బ్యాంకింగ్ సెక్టార్, సేవ్ గర్ల్ చైల్డ్ ఇతివృత్తంగా వేసిన ముగ్గులు ఆలోచింపజేశాయి. అనంతరం న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు మొదటి బహుమతిని ఎల్.అరుణ కుమారి, రెండో బహుమతిని వై.జ్యోతి, మూడో బహుమతిని బి.బిందు, నాలుగో బహుమతిని జి.నవ్య, ఐదో బహుమతిని వై.మాధవి, ప్రత్యేక బహుమతిని జి.స్వప్న దక్కించుకున్నారు. వారికి అతిథులు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను బహూకరించారు.

కోలాటంతో ఆకట్టుకున్న సమైక్య అపార్టుమెంట్ మహిళలు

అరుణకుమారికి బహుమతి అందజేస్తున్న అతిథులు

ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి : వక్తలు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సభలో తొలుత ప్రజాశక్తి విశాఖ బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. సంక్రాంతి పండగ ఆవశ్యకతను తెలియజేశారు. ప్రజాశక్తి కళలను, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడేందుకు విశేష కృషి చేస్తోందన్నారు. ప్రకృతి విపత్తుల వేళ బాధితులకు విరాళాల సేకరణ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ముగ్గుల పోటీలకు జడ్జిగా వ్యవహరించిన ఐద్వా స్టీల్ జోన్ కార్యదర్శి వేణు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జివిఎంసి 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ ముగ్గుల పోటీలను నిర్వహించిన ప్రజాశక్తి యాజమాన్యాన్ని అభినందించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైశ్యరాజు జ్యూయలర్స్ గాజువాక బ్రాంచి జనరల్ మేనేజర్ ఎ.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో తమను భాగస్వామ్యం చేసినందుకు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు. ముగ్గులతో చైతన్యం నింపిన మహిళలను అభినందించారు. కార్యక్రమంలో సమైక్య అపార్టుమెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తౌడన్న, మహిళా కమిటీ అధ్యక్షులు మణి, కార్యదర్శి స్వప్న, తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి కె.అప్పలనాయుడు వందన సమర్పణ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి బాబు, పవన్‌ల కలయిక అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయిక ఒక చారిత్రక అవసరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిలో దుర్మార్గమైన పాలన అంతంకావాలంటే భావసారూప్య పార్టీల మధ్య ఐక్యత అవసరమన్నారు. చీకటి జీవోలను తెచ్చి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రాబోయే ఎన్నికలలో గుడివాడ అమర్‌నాథ్‌ను చిత్తుచిత్తుగా ఓడించడానికి అనకాపల్లిలో కాపు సామాజిక తరగతి సిద్ధంగా ఉందన్నారు. బాబు, పవన్‌ల కలయిక అరాచకవాదుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తుందన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తానన్న పాలకుల మాటలు ఒట్టి నీటి మూటలు అయ్యాయని, మద్య నిషేధం చేస్తామని చెప్పి మోసగించారని మండిపడ్డారు.

బైపాకు తెలంగాణ సిఎం కెసిఆర్ ఆహ్వానం

- బిఆర్ఎస్ విశాఖ పగ్గాలు అప్పగించే అవకాశం ?

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, విశాఖకు చెందిన సీనియర్ అడ్వకేట్ బైపా అరుణ్‌కుమార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నుంచి ఆదివారం ఆహ్వానం లభించింది. ఇటీవలే కెసిఆర్ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)గా తెరాసను నామకరణం చేసిన తర్వాత తెలుగు రాష్ట్రాల్లోని ఎపిపై మరింత దృష్టిసారిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎపిలో తన రాజకీయ కార్యకలాపాల నిర్వహణకు జిల్లాల వారీగా వివిధ రంగాల్లో నిపుణులను ఎంపిక చేసుకుంటున్నట్లు భోగట్టా. ఈ క్రమంలో విశాఖకు చెందిన సీనియర్ న్యాయవాది, గతంలో పాయకరావుపేట నుంచి ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీచేసి ఓటమి చెందిన బైపా అరుణ్‌కుమార్‌కు ఆహ్వానం పంపారు. సోమవారం ఆయన హైదరాబాద్ వెళ్తున్నారు. సామాజిక, దళిత ఉద్యమ కార్యక్రమాల్లో బైపా తనదైన శైలిలో పాల్గొంటూ వస్తున్నారు. ఇటీవలే విశాఖ నగరానికి తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విచ్చేసి ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, సివిల్ సర్వీసెస్‌లో స్థానం సంపాదించాలని చూసేవారికి తెలంగాణలో ల్యాప్‌టాప్‌లు, కోచింగ్ సెంటర్లకు ఫీజులను తాము చెల్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అంబేద్కర్ భవన్‌ను ఆ మంత్రి సందర్శించిన సందర్భంలో బైపా కూడా ఆయనకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.లక్ష విరాళం అందజేశారు.

బిఆర్ఎస్ పార్టీ ఏం చేయబోతోంది ?

బిఆర్ఎస్ పార్టీని ఉమ్మడి విశాఖ జిల్లాలో బలోపేతం చేసే దిశగా కెసిఆర్ పావులు కదుపుతున్నట్లు, అందుకు బైపాయే సరైన వ్యక్తిగా భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బిఆర్ఎస్ ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనివ్వబోమని, ఒకవేళ జరిగినా తాము అధికారంలోకి వస్తే వెనక్కి తెస్తామని నొక్కి చెప్పింది. అలాగే ఎల్ఐసిని ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షణ పోరాటంలో పాల్గొంటామని కెసిఆర్ హామీ ఇచ్చారు. 'బిజెపిది ప్రైవేటైజేషన్ విధానం అయితే తమది నేషనలైజేషన్' అంటూ ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు బిఆర్ఎస్ కట్టుబడి ఉంటుందని తేల్చిచెప్పారు. ఈ విధానం తీసుకోవడంతో దేశంలో బిఆర్ఎస్ పార్టీపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. అరుణ్‌కుమార్ ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 'దళిత, గిరిజన, బహుజనుల రక్షణ కోసం ప్రభుత్వ రంగం ఉండాలి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉంది. కెసిఆర్ ఆహ్వానం మేరకు హైదరాబాద్ వెళ్తున్నాను' అని తెలిపారు.



దీక్షల్లో కూర్చున్న నడుపూరు గ్రామస్తులు

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే తాట తీస్తాం

ప్రజాశక్తి - గాజువాక : దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే తాట తీస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నడుపూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నడుపూరులో ఆదివారం 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలకు మద్దతు తెలుపుతూ వారు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన వారిలో నేటికీ 8500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. పోరాటాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతోనే రక్షించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నాయకులు తాటికొండ జగదీష్, నీరుకొండ రామచంద్రరావు, మంత్రి గోపి, ములంపాక ప్రసాద్, పల్లం గోపి, రౌత్ గోవింద్, గొంతిన జగదీష్ కుమార్, జాగారాపు రాంబాబ పాల్గొన్నారు.